వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం కెసిఆర్
- తొలిబోనం సమర్పించిన మంత్రి తలసాని
- ప్రత్యేక పూజలు చేసిన కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి
- బంగారు బోనంతో ఎమ్మెల్సీ కవిత
- నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం కన్నుల పండువగా సాగింది. మహిళల కోలాటాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాల కోలాహలాలు, ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు నివాసంలోని ముత్యాలమ్మ గుడిని సందర్శించారు. సిఎం వెంట మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపి సంతోష్ తదితరులున్నారు. అంతకుముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, తన కుటుంబ సభ్యులతో దేవాలయానికి రాగా ఆయన సతీమణి స్వర్ణ బోనంతో అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. అనంతరం సాధారణ సందర్శకులను అనుమతించారు. మహంకాళి బోనాల జాతర విశ్వవ్యాప్తమైందని, ఆలయానికి వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తలసాని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. కవిత వెంట మంత్రులతో పాటు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ తదితరులున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బిజెపి నాయకులు ఈటల రాజేందర్, గ్రేటర్ హైదరాబాద్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, నాయకులు దానం నాగేందర్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పద్మా దేవేందర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్‌డిఒ వసంత కుమారి పాల్గొన్నారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల నుంచి ఇతర మార్గాల వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు.

పోలవరం ముంపు నుంచి కాపాడాలంటూ..

సిపిఎం పాదయాత్ర

- పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం ముంపు నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రతోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ముంపు కాలనీల్లో సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ చేపట్టిన రెండవరోజు పాదయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం పట్టణానికి పోలవరం ముంపు ప్రమాదం ఉందని, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి ముంపు లేని ప్రత్యామ్నాయంతో నిర్మించాలని 2007లోనే పార్టీ హెచ్చరించిందని గుర్తుచేశారు. అప్పుడే ఉమ్మడి నియోజకవర్గంలోని ఇప్పూరు నుంచి పోలవరం వరకు 650 కి.మీ పాదయాత్ర చేసిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. నిత్యం రామ జపం చేస్తున్న బిజెపి దక్షిణాయోధ్య రాముడు మునుగుతుంటే పట్టించుకోదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం పట్ల వివక్షత చూపుతోందని అన్నారు. కెసిఆర్ ప్రకటించిన వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేయాలని, గోదావరి కరకట్ట ఎత్తు పెంచి పొడిగించే దానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన విస్తా కాంప్లెక్స్ వ్యాపారులకు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం పోరాడిందని గుర్తు చేశారు. ఈ పాదయాత్రకు సిపిఐ (ఎం.ఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి తెచ్చల కల్పన, భద్రాచలం సొసైటీ చైర్మెన్ అబ్బినేని శ్రీనివాస్ మద్దతు తెలిపారు. పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పాల్గొన్నారు.

బిసి గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం..

31లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తులు

- కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలలలో బిఎస్‌సి మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి మల్లయ్యభట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఎంసెట్- 2023 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులు https://mjpt-bcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంసెట్-2023 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. సీటు సాధించిన విద్యార్థినీలు కాలేజి హాస్టల్‌లోనే ఉండాలనీ, డే-స్కాలర్స్ విధానం ఉండదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.2,00,000 మించని విద్యార్థినీలు మాత్రమే అర్హులని తెలిపారు . దరఖాస్తు చేయడంలో ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 ఫోన్ నెంబర్లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

దక్షిణ కొరియా తరహాలో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి

- మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షణ కొరియా తరహాలో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని ఇండియన్ అంబాసిడర్ అమిత్ కుమార్‌తో ఆదివారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దక్షిణ కొరియాలో పర్యాటక, క్రీడా రంగాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. ఆ దేశంలోని అమ్యూజ్మెంట్ పార్కులు, అడ్వెంచర్ టూరిజం, చిన్నపిల్లల పార్కుల అభివృద్ధి తరహాలో హైదరాబాద్‌లోనీ టాంక్ బండ్, బుద్వేల్, గండిపేట తదితర పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దక్షిణ కొరియా తరహాలో క్రీడా మైదానాలలో మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాటుకు, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

కమ్ముకుంటున్న కరువు మేఘాలు

- వర్షాభావంతో రాష్ట్రం విలవిల
- వానల కోసం రైతుల బెంగ
- ప్రత్యామ్నాయ చర్యలపై సర్కారు దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరువు.. మానవజీవితాన్ని తీవ్రంగా ప్రభావం చేసే ప్రకృతి బీభత్సం. సాధారణంగా నెర్రెలు బారిన నేలలు.. ఎండిపోయిన పంటలు.. నీళ్ల లేక నోరు తెరిచిన బావులు, చెరువులు, కుంటలు కనిపిస్తాయి. వీటన్నింటిని చూస్తే భీకర కరువుగానే అందరమూ భావిస్తాం. కానీ, అసలు వాస్తవం వేరు. వర్షపాతం ఆధారంగా కరువును అంచనా వేస్తారు. దానికి కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. వానల్లేక పంటల సాగు తీవ్ర ఆలస్యమవుతోంది. దీంతో మేఘాల కోసం ఆకాశానికేసి చూడాల్సిన పరిస్థితులు ఇప్పుడు నెలకొన్నాయి. ప్రతిరోజూ మబ్బులు కనిపిస్తున్నాయి. వాతావరణం ఉక్కగా ఉంటోంది. కాగా, వర్షం మాత్రం కురవడం లేదు. ఆకాశం మేఘావృతం కావడమే తప్ప, వానల జాడ లేదు. ఒకవేళ పడ్డా చెదురు,ముదురు చినుకులు మినహా భారీ వర్షాలు కురవకపోవడం గమనార్హం.

ఎలా లెక్కిస్తారు..

కరువును అంచనా వేయడానికి ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉన్నాయి. వరుసగా 21 రోజులు వర్షంపడకపోతే కరువుఛాయలు నెలకొన్నట్టుగా భావిస్తారు. అలాగే 21 నుంచి 28 రోజుల వరకు వర్షం పడకపోతే కరువు కింద అంచనా వేస్తారు. ఇకపోతే 28 నుంచి 43 రోజులు వానరాకపోతే తీవ్రమైన కరువుగా నిర్ణయిస్తారు.

వర్షపాతం...

పడాల్సినదానికన్నా 19 శాతం లోపు వర్షపాతం తక్కువ పడితే 'లోటు' వర్షపాతం అంటారు. 35 శాతం లోపు పడితే కరువు ప్రాంతంగా గుర్తిస్తారు. 35 శాతంపైన పడకపోతే తీవ్రమైన కరువు కింద భావిస్తారు. 500 మిల్లీమీటర్ల లోపు వర్షపాతం పడే ప్రాంతాలు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు వీటి కిందే వస్తాయి. 500 ఎం ఎం నుంచి 700 ఎంఎం వరకు వానలుపడ్డ ప్రాంతాల కింద ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు ఉన్నాయి. 750 ఎంఎంపైన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఇదిలావుండగా 2.5 ఎం. ఎం వర్షం పడితే ఒక వర్షం రోజు కింద పరిగణిస్తారు. 2.4 ఎంఎం పడితే ఒక తడిగా భావిస్తారు.

లోటు

వర్షం పడాల్సిన దానికంటే 25 లోపు ఉన్న జిల్లాలు రాష్ట్రంలో ఇప్పుడు 30 జిల్లాలు ఉన్నాయి. 51 శాతం నుంచి 75 శాతం ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్‌లో పడింది. మొత్తం వర్షపాతం 119.0 ఎంఎంకుగాను 66.9 శాతం పడింది. లోటు 44 శాతం తక్కువగా ఉంది. 20లోపు జిల్లాలు సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, నల్లగొండ, నాగర్‌కర్నూల్ ఉన్నాయి.

ప్రస్తుతం పంటల పరిస్థితి

వానాకాలంలో జూన్ 28 నాటికి 15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఇందులో 12.25 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. గత ఏడాది ఇదే సమయానికి 20 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. పత్తి మాత్రం బాగానే సాగవుతోంది. వరినాట్ల సంగతి పరిశీలిస్తే వానల్లేక ఇప్పుడిప్పుడే నార్లు పోస్తున్నరు. పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు విత్తారు. కొన్ని చోట్ల మొల్లకెత్తలేదు. గింజలకు పురుగులు, చీమలు ఆశించి విత్తనాలను తినేశాయి. ఎండలు సైతం ఒక కారణం. మొలిచిన పంటలకు సంబంధించి పత్తి విషయంలో ఎకరానికి రూ. ఐదు వేలు ఖర్చుపెట్టారు. కొంత మంది రైతులు పెట్టుబడి పెట్టలేక వదిలేశారు.

రైతుబంధు 15 లక్షల మందికే

రైతుబంధు 15 లక్షల మంది రైతులకే అందుతున్నది. 64 లక్షల మందికి ఇవ్వాల్సి ఉంది. కానీ, చాలా మంది ఈ పథకంపై ఆధారపడ్డారు. రుణ ప్రణాళిక ప్రకటించినా బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. ఒక్కో ఎకరాలకు కనీసం రూ. ఐదు వేలు పెట్టుబడిపెట్టారు. యంత్రాలతో దున్నడం, విత్తనాలు, డిఎపి కోసం ఖర్చుపెట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తిన తర్వాత 90 రోజుల పాటు పంటలపై ఫెర్రిత్రాయిడ్ మందులు కొట్టకూడదు. బాగా దెబ్బతిన్న పంట పెసరు. మూడురోజులు గట్టిగా ఎండలు కొడితే నాశనమవుతుంది. కందులు 5.62 లక్షల ఎకరాలకుగాను 85 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. వేరుశెనగ వానాకాలంలో 20 వేల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 729 ఎకరాల్లో మాత్రమే అయింది. ప్రభుత్వం నుంచి రుణాలు భారీగా లేకపోవడం, రైతుబంధు అందరికి అందకపోవడంతో ప్రయివేటు అప్పులు తెచ్చుకుంటున్న పరిస్థితి ఇప్పుడుంది.

చెరువులు నింపడం

సిఎం కెసిఆర్ ప్రకటన ప్రకారం ప్రాజెక్టుల్లోని నీళ్లతో చెరువులు నింపాల్సి ఉంది. మొట్టప్రాంతాలకు చెరువులు నింపడంతో ప్రయోజనం ఉండదు. వానాకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు వేయాలి. కానీ, వర్షాభావంతో 15 లక్షల ఎకరాల్లో సాగుకావడం గమనార్హం. తక్కువ కాలంలో పండే ఆ మెట్ట పంటవిత్తనాలను రైతులకు అందుబాటులో తేవాల్సి ఉన్నా, ఆ ప్రయత్నాలేవీ సర్కాను నుంచి లేవు. మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి, నూనెగింజలు, వరి ఒకే రకమైన విత్తనాలు మార్కెట్లో ఉన్నాయి. పరిశోధనలు లేకపోవడంతో తక్కువ కాలపరిమితి పంటల విత్తనాలు రాష్ట్రంలో దొరకడం లేదు. దీంతో పంటలువేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.పది వేలు పరిహారంగా చెల్లిస్తేనే మళ్లీ కొత్తగా విత్తనాలు తయారుచేయడానికి వీలుంటుంది.

మరమ్మతులు చేయాలి

ప్రాజెక్టులు, చెరువులు, కాలువలను వానాకాలంలో కచ్చితంగా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లేలా ఈ చర్యలు తీసుకోవాలి. కృష్ణా, గోదావరిలో వస్తున్న నీటిని ప్రాజెక్టులు నింపడానికి ఎత్తిపోతల పథకాలను అన్నింటిని వినియోగించాలి. వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ మొత్తం గణాంకాలు సేకరించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి. మరో పది రోజుల్లో వర్షాలు పడకపోతే వరి మినహా ఇతర పంటలను అనివార్యంగా మార్చాల్సి ఉంటుంది.

కరువుతో నష్టం

2014 నుంచి 2018 వరకు కరువులు తీవ్రంగా వచ్చాయి. భారీ నష్టం వచ్చింది. 2015లో రూ. వేల నష్టం వచ్చింది. రాష్ట్రం ఆవిర్భావం తొలినాళ్లల్లో కరువు రాగా, ఆతర్వాత వరదలు శాపంగా మారాయి. 2018-19 నుంచి ఒకే ప్రాంతంలో వరదలొచ్చాయి. కేంద్రం 14వ ఫైనాన్స్ కమిషన్ 2015 నుంచి 2020 వరకు, 15 వ ఫైనాన్స్ కమిషన్ 2020 నుంచి 2023 వరకు నిధులు ఇస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం భారీగా నష్టపరిహారం నిధులు ఇవ్వడం లేదు. బృందాలను పంపడంలో ఆలస్యం చేయడం, పదే పదే అడిగిన తర్వాత నిధులు ఇస్తుండటంతో ఆశించిన ప్రయోజనం ఉండటం లేదు.

రాజ్యాంగ పరిరక్షణకు సంఘటితం కండి

- మోడీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం
- మతోన్మాదులతో జాగ్రత్త...
- సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా సంఘటితం కావాలని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ పిలుపునిచ్చారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. కొత్త రాజ్యాంగం పేరుతో మరో కొత్త డ్రామాకు మోడీషాలు తెరలేపుతున్నారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల లోపు ప్రజల దృష్టిని మళ్లించి, ఓట్లు దండుకొనేందుకు మతోన్మాదశక్తులు కుట్రలు చేస్తాయనీ, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి జంగమ్మెట్‌లో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ అప్పట్లోనే వ్యతిరేకించిందని, దాని స్థానంలో మనుస్మృతిని అమల్లోకి తేవాలని ప్రతిపాదించిందని వివరించారు. ఇప్పుడు దేశంలో ఆ మనుస్మృతి ఆధారంగానే దుస్సంఘటనలు జరుగుతున్నాయంటూ బిల్కినోబాను కేసు సహా పలు అంశాలను ఆమె ఉదహరించారు. గడచిన తొమ్మిందేళ్లలో దేశంలో నిరుద్యోగం, ధరలు ఆకాశమంత ఎత్తు ఎదిగాయనీ, వాటిని నియంత్రించడంలో మోడీ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గతంలో ప్రభుత్వాలతో పోరాడితే, కనీసం ఆ సమస్యలు ఏంటో తెలుసుకొనే ప్రయత్నమన్నా చేసేవనీ, కానీ గడచిన తొమ్మిదేళ్లలో ఏనాడు మోడీ సర్కారు ప్రజా ఆకాంక్షలతో కూడిన ఆందోళనల్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం దేశంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లపై కూర్చుని, కట్టెల పొయ్యిలో పొగ గొట్టాలను ఊదుకొనే పరిస్థితి కల్పించారని ఎద్దేవా చేశారు.

సదస్సులో మాట్లాడుతున్న సుభాషిణి అలీ

అధికారం కోసం ప్రజల మధ్య అసమానతలు, ద్వేష భావాన్ని పెంచి పోషించే దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పేద, ధనిక తారతమ్యాన్ని పెంచి ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లేలా పరిపాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన మహిళా రెజ్లర్ల డిమాండ్లను పరిష్కరించడంలో మోడీ సర్కారు నిర్లక్ష్యంగా, నిర్దయగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు అరెస్టు చేయట్లేదని ప్రశ్నించారు. చట్టాలు పేదలు-పెద్దలపై భిన్నంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. దేశం కోసం, ధర్మం కోసం అంటూ సెంటిమెంటును రాజేసి, ఓట్లు దండుకోవడానికి వచ్చే నేతలకు ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సిపిఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండి అబ్బాస్ అధ్యక్షత వహించారు. చాంద్రాయణగుట్ట జోన్ కన్వీనర్ ఎల్ కోటయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం మీనా, జి విఠల్, పి నాగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కిషన్, ఎండి బాబర్‌ఖాన్, ఎ కృష్ణ, ఎం బాలునాయక్, ఎం శ్రవణ్‌కుమార్, ఎండి అబ్దుల్ సత్తార్, ఎం లక్ష్మమ్మ, చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సభ్యులు నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే మోడీ పర్యటన

- పునర్విభజన చట్టంలో హామీలను ప్రస్తావించని ప్రధాని : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజలను మభ్యపెట్టడం కోసమే అభివృద్ధి పనుల పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనకు వచ్చారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పునర్విభజన చట్టంలోని హామీలను ప్రస్తావించకుండా రాష్ట్ర పర్యటనకు ఎలా వచ్చారని ప్రశ్నించారు. విభజన చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీతోపాటు కాళేశ్వరం ప్రాజెక్ట్ కు జాతీయ హోదా కల్పించాల్సిన బాధ్యత ప్రధానిదేనని అన్నారు. రూ.20 వేల కోట్లతో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఇక్కడి పది వేల మంది యువతకు ఉపాధి లభించేదని పేర్కొన్నారు. కానీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని మోడీ గుజరాత్ తరలించారని మండిపడ్డారు. రూ. 500 కోట్లతో పనులు ప్రారంభమై నడుస్తున్న వ్యాగన్ రిపేర్ ఫ్యాక్టరీని అభివృద్ధి పేరుతో ప్రారంభించారని ఎద్దేవా చేశారు.రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రాదని తెలిసి ప్రజలను మభ్యపెట్టడానికే రూ.ఆరు వేల కోట్ల పనులు ప్రారంభించారని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్న మోడీ తెలంగాణకు తొమిదేండ్లలో ఎన్ని కోట్లు మంజురు చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. దోచుకున్న సొమ్ముతో ఇతర పార్టీల ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేసి కృత్రిమ బలంతో ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నారని మండిపడ్డారు. ఏడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోవడంతో మోదీ ముఖంలో ఓటమి భయం కనబడుతుందన్నారు. బిజెపి అరాచకాలను అడ్డుకోవడం కోసం పోరాటాలను కొనసాగిస్తామన్నారు. మతోన్మాద పార్టీ బిజెపిని కేంద్రంలో గద్దె దింపడానికి లౌకిక పార్టీలు ఒకే వేదిక మీదకు వస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు పవన్, వేణు, సదానందం, సురేశ్, నగరం కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపిలో చేరగానే నీతిమంతులవుతారా?

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు, మంత్రులు.. పలువురు రాజకీయనాయకులు బిజెపిలో చేరితే వారంతా నీతిమంతులవుతారా అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటిరంగారెడ్డి ప్రశ్నించారు. శనివారం ప్రధాని తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పందిస్తూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఏ రాష్ట్రంలో జరగలేదన్న ప్రధాని మోడీ కేంద్రంలో ఉన్నది వారి ప్రభుత్వమే కదా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. దేశంలోని అన్ని రకాల వస్తువులపై జిఎస్‌టిని ఇష్టమొచ్చిన రీతిలో పెంచుకుంటూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. బ్యాంకుల్లో రూ.లక్షల కోట్లు అప్పులు తీసుకుని ఎగవేతకు పాల్పడే వారికి కేంద్రం అండగా నిలిచిందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు అదాని ఆస్తి రూ.40 వేల కోట్లు ఉండేదని, ఇప్పుడు రూ.11లక్షల కోట్లకు చేరిందన్నారు. 60,70 ఏళ్లుగా ప్రజలంతా ఏర్పాటు చేసుకున్న పబ్లిక్ సెక్టార్లను బడా కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మేస్తున్నారని విమర్శించారు. బిజెపి అధికారంలోకి రానప్పుడు దేశంలో రూ.60 లక్షల కోట్ల అప్పు ఉండగా, నేడు రూ.1.47లక్షల కోట్లకు చేరిందన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను కూల్చడమే ధ్యేయంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకురావడంతో పాటు మతవిద్వేషాలు రెచ్చగొట్టి తెలంగాణలో బలపడాలని చూస్తున్నారన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన తెలంగాణ ప్రజలు ఇలాంటి వారిని దగ్గరకు రానివ్వరని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వాన్ని నడపాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతమ్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, కుంకు తిరుపతయ్య, నీలా రామ్మూర్తి పాల్గొన్నారు.

గురుకులంలో కనీస సౌకర్యాలు నిల్

- డోర్నకల్ మైనార్టీ పాఠశాల ముందు తల్లిదండ్రుల ధర్నా
- మైనార్టీ బోర్డు నాయకునిపై దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు సరైన వసతులు లేవంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులను సముదాయించేందుకు వచ్చిన మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు అఖిల్ కాన్‌పై తల్లిదండ్రులు దాడి చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండేళ్లుగా డోర్నకల్‌లో కనీస సౌకర్యాలు, భవన వసతి లేదంటూ డోర్నకల్ నియోజకవర్గంలోని కొరివి మండల కేంద్రంలో పాఠశాల కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆ పాఠశాలను డోర్నకల్ మండల కేంద్రంలోని ప్రయివేటు భవనానికి మార్చారు. జూన్ 12వ తేదీన పాఠశాల ప్రారంభమైంది. అయితే, 500 మంది విద్యార్థినులు ఉన్న హాస్టల్‌లో ఐదు బాత్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయని, అవి ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. అంతే కాకుండా త్రాగునీరు సక్రమంగా లేదని, విద్యార్థులకు స్నానాలకు సరిపోయేంతగా నీళ్లు రావడంలేదని, మోటార్లు పనిచేయడం లేదని, భోజనం సరిగ్గా ఉండటం లేక తమ పిల్లలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ పిల్లలను చూడటానికి వస్తే తమకు మంచినీళ్లు లేవని, బాటిళ్లు కొనుక్కురమ్మని చెప్పడం తమ హృదయాలను కలిచివేసిందని వాపోయారు. మైనార్టీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యుడైన అఖిల్, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో పాటు కొందరు అధికారపార్టీ నేతల రాజకీయ ఒత్తిళ్లతోనే పాఠశాలను డోర్నకల్‌కు తరలించి పిల్లల భవిష్యత్తులో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరవిలో అన్ని హంగులతో సౌకర్యవంతంగా ఉందని, ఇప్పటికైనా కొరివికి పాఠశాలను తరలించాలని డిమాండ్ చేశారు. కాగా, తల్లిదండ్రుల ఆందోళన సమయంలో ప్రిన్సిపాల్ పుష్పజా రెడ్డి అందుబాటులో లేకపోవడంతో మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు అఖిల్ ఖాన్ పాఠశాలకు రాగా, అతని ద్విచక్ర వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్ లాక్కొని అతనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రిన్సిపల్ పద్మజా రెడ్డి హాస్టల్‌కు చేరుకున్నారు. ఇదే క్రమంలో వరంగల్‌కు చెందిన విజిలెన్స్ అధికారులు అంజద్ పాషా, మక్బూల్ ఆశ పాఠశాలకు చేరుకున్నారు. కాగా, ఈ మొత్తం ఘటనకు ప్రిన్సిపాల్ బాధ్యతా రహిత్యమే కారణమని మున్సిపల్ చైర్మెన్ వాంకుడోత్ వీరన్న అధికారులకు ఫిర్యాదు చేశారు. కొరవి నుంచి డోర్నకల్‌కు పాఠశాలను తరలించడం ప్రిన్సిపాల్‌కి ఇష్టం లేదని, అందుకే తల్లిదండ్రుల చేత ఆందోళన చేపిస్తుందని ఆరోపించారు. ఈ మేరకు డోర్నకల్‌కు చెందిన మైనార్టీ నాయకులంతా సంఘటన స్థలానికి వచ్చి ఆందోళన చేశారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు సంఘటన స్థలంలో పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

బిఎస్ఎన్ఎల్ పరిపుష్టికి చర్యలు తీసుకోవాలి

- బిఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనిమేశ్ మిత్రా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఎస్ఎన్ఎల్ పరిపుష్టికి చర్యలు తీసుకోవాలని, 4జీ, 5జీ సేవలను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బిఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనిమేశ్ మిత్రా డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో బిఎస్ఎన్ఎల్ సౌత్‌జోన్ రాష్ట్రాల సమావేశం జరిగింది. దీనికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిమేశ్ మిత్రా మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో పాటు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని సమావేశంలో తీర్మానించామన్నారు. సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ కాంట్రాక్టు పద్ధతి రద్దు చేయాలనీ, అవుట్ సోర్సింగ్ వర్కర్లకు కనీసం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సంస్థలో ఇప్పటి వరకూ అక్రమంగా 60 వేల మందిని తొలగించారని, వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. సర్వీసులను ప్రయివేటీకరణ చేసిన తర్వాత అవుట్ సోర్సింగ్‌లో వర్కర్లను నియమించుకుని ఎక్కువ గంటలు పనిచేయించుకుంటూ తక్కువ వేతనాలిస్తున్న తీరును వివరించారు. మేనేజ్ మెంట్ కక్షపూరితంగా యూనియన్లలో కీలకంగా ఉన్న కార్మికులను వేధిస్తూ వేరే జిల్లాలకు బదిలీ చేయడం దారుణమన్నారు.

తెలంగాణ బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం తిరుమలాచార్యులు, బి పరిపూర్ణాచారి

బిఎస్ఎన్ఎల్ తెలంగాణ క్యాజువల్, కాంట్రాక్టు ఎంప్లాయిస్, లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం తిరుమలాచార్యులు, బి పరిపూర్ణాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ యూనియన్ సమావేశం హైదరాబాద్‌లో బి మధు అధ్యక్షతన జరిగింది. అందులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి సాంబశివరావు, ఉపాధ్యక్షలుగా తులసీరామ్, బి నాయుడు, కార్యదర్శులుగా రాఘవేందర్, హరీశ్, కోశాధికారిగా బి శ్రీధర్లు, నిర్వహణ కార్యదర్శులుగా నవీన్, నాగరాజు, నవీన్, జానీ, రాజా సతీష్, కమిటీ సభ్యులుగా పది మంది ఎన్నికయ్యారు.

బాల కార్మికులతో వెట్టిచాకిరీ

- కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి
- వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి
- పారిశ్రామిక ప్రాంత కార్మికుల సమస్యలపై జీపుజాతాలో : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామిక రంగాల్లో బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం చట్టాలను అమలుచేస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె మల్లికార్జున్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల నాలుగున బయలుదేరిన జీపుజాత ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం, చేగుంట పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యటించింది. సాగర్ ఏషియా యూనిట్ 2, మహాలక్ష్మి, గ్లోబల్, గ్లోస్టర్, కాలకల్ ఫౌండ్రి, ఇన్ఫ్రాటెక్, పరిశ్రమల దగ్గర, చేగుంటలో నిర్వహించిన సభల్లో భూపాల్, మల్లికార్జున్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.

ప్రభుత్వాలు కార్మికుల పొట్టకొట్టి బడా బాబులను పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. పారిశ్రామిక రంగ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. చాలా కంపెనీల్లో బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. 2014 నుంచి కనీస వేతనాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, సెలవులు, ఒటి డబల్ వేతనం, యూనిఫామ్, బూట్లు, క్యాంటీన్ ప్రమాదం తర్వాత ఆదుకోవడం తదితర సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మహాలక్ష్మి, గ్లోస్టర్, గ్లోబల్, సాగరేసియా, కాలకల్ ఫౌండ్రి, బీహార్, ఒడిశా, ఇతర రాష్ట్రాల కార్మికులకు సరైన సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా 12 గంటల పనులు చేయిస్తున్నారని చెప్పారు. వలస కార్మికులనైతే కంపెనీల ఆవరణలో చిన్న చిన్న గదుల్లో పది నుంచి 15 మందిని పెట్టి, కనీస సౌకర్యాలు లేకుండా బానిసల మాదిరిగా గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి అనువైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ మల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు వెంటనే సవరించాలని కోరారు. ఐదు రంగాలకు చెందిన ఫైనల్ నోటిఫికేషన్ జిఒ నెంబర్లు 21 ,22, 23, 24, 25ను గెజిటెడ్ చేయాలన్నారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత దృష్ట్యా రోజుకు ఏడు గంటలు, వారానికి ఐదు రోజుల పని దినం ఉండాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధత సౌకర్యాలు పిఎఫ్, ఇఎస్ఐ, సెలవులు, బోనస్, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా వలస కార్మికులు ఉంటున్న ప్రదేశాలు, గదులను పరిశీలించారు. విద్యుత్ నీటి సౌకర్యం, వాష్ రూమ్, ఎలాంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 14న జిల్లా కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులను, జిల్లా అధ్యక్షులను, అపోలో కార్మికులు సన్మానం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి బస్వరాజ్, అధ్యక్షులు ఎ మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి బాలమణి, అపోలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గడ్డమీది రామస్వామి, సతీష్ గౌడ్, గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, స్వామి, రాములు, వీరేష్, సుగుణ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఇండస్మేడ్ కేర్ ప్రధాన కార్యదర్శి బాలేష్, పారిశ్రామిక కార్మికులు, గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

- మరియం ధావలే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ఆడపిల్లలు కరాటేలాంటి శిక్షణ ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలె పిలుపునిచ్చారు. ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా పిల్లలకు ఉచిత కరాటే శిక్షణను ఇస్తున్న నేపథ్యంలో వీరికి పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. బ్లాక్ బెల్టు వచ్చే వరకు శిక్షణను పొందాలని సూచించారు. వ్యక్తి గత జీవితంలో క్రమ శిక్షణగా ఉంటూ విద్యలో మొదటి స్థానం సంపాదించాలని కోరారు. సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ట్రస్ట్ కార్యదర్శి బి హైమావతి, కెఎన్ ఆశాలత, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ అవినీతిపై చర్యలెందుకు తీసుకోరు?

- కేంద్ర సర్కారుకు వైఎస్ షర్మిల ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ దాకా కెసిఆర్ అవినీతి పాకిందని బిజెపి చెబుతున్నదని, కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నువ్వు కొట్టినట్లు చెయ్యి, నేను ఏడ్చినట్టు నటిస్తానంటూ జరిగిన ఒప్పందంలో భాగమే ఇరు పార్టీలు విమర్శించుకుంటున్నాయని పేర్కొన్నారు. నిజంగా వీరి మధ్య ఎలాంటి రాజకీయ ఒప్పందం లేకపోతే.. కెసిఆర్ ప్రభుత్వ అవినీతిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మాయల పకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్టుగా కెసిఆర్ అవినీతి చిట్టా బిజెపి దగ్గర ఉందని తెలిపారు. కాళేశ్వరం అవినీతిపై సాక్ష్యాధారాలున్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. విభజన హామీలపై అమీతుమీకి ఎందుకు సిద్ధపడటంలేదో తేల్చాలని బీఆర్ఎస్ సర్కార్‌ను ఆమె ప్రశ్నించారు. లిక్కర్ స్కాం నుంచి ఇరు ప్రభుత్వాల మధ్య పలు అంశాలపై ఒప్పందాలు కుదిరాయని ఆరోపించారు.

వినోద్‌రెడ్డి మృతి సిపిఎంకు తీరనిలోటు

- కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

గుజ్జ ఎంపిటిసి, సిపిఎం నాయకులు దోడ వినోద్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. వినోద్‌రెడ్డి భౌతికకాయానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, బంధుమిత్రులు కన్నీటితో వినోద్‌రెడ్డి భౌతికకాయానికి తుది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. గ్రామంలో పార్టీ బలోపేతానికి వినోద్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండేవాడని గుర్తు చేశారు. అంత్యక్రియలకు నారాయణపురం మండలంలోని పలు గ్రామాల పార్టీ కార్యకర్తలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అనేక మంది పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. పుట్టపాకకు చెందిన డప్పు కళాకారులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలతో అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి వీరమల్ల భానుమతి వెంకటేష్, పుట్టపాక ఎంపిటిసి మర్రి వసంత, సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి, కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేష్, మాటూరి బాలరాజుగౌడ్, సర్పంచులు మైల యాదవరెడ్డి, దోనూరు జయపాల్‌రెడ్డి, కట్టెల భిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జి శ్రీనివాస్ ఆచారి, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు సిఎం ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకులు సాయిచంద్‌కు సిఎం కెసిఆర్ నివాళులర్పించారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సాయిచంద్ దశదిన కర్మకు సిఎం కెసిఆర్ హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలతో నివాళులర్పించారు. సాయి చంద్ సతీమణికి ధైర్యాన్ని చెప్పారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, మండలి చైర్మెన్ గుత్తా సురేందర్ రెడ్డి, ఎంపి రాములు, ఎమ్మెల్యేలు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డితోపాటు వందలాది అభిమానులు విచ్చేసి చిత్రపటానికి నివాళులర్పించారు.

సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిఎం కెసిఆర్

కుల దురహంకార హత్యలపై పాలకుల మౌనం

- ప్రత్యేక చట్టం తేవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కుల మత దురహంకార హత్యలపై పాలకులు మౌనం వీడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దురహంకార హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం తేవాలని సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిపిఎస్‌కే, కెవిపిఎస్ సంయుక్తంగా కుల దురహంకార హత్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎవరికి వారుగా కాకుండా ఐక్యంగా 'కుల, మతాంతర వివాహాల రక్షణ వేదిక' గా ఏర్పడాలని సూచించారు. ఈ వేదిక బాధితులకు అండగా ఉండాలని సూచించారు. మీడియాలో పరువు హత్యల పేరు పెట్టి ప్రచారం చేయడం తగదని గుర్తుచేశారు. కులోన్మాద, పురుషాహంకార, హత్యలుగా చూడాలని విజ్ఞప్తి చేశారు. టిపిఎస్‌కే రాష్ట్ర నాయకులు జి రాములు మాట్లాడుతూ కుల, మత ధర్మాల పేరుతో, సనాతన సంప్రదాయం పేరుతో బిజెపి ప్రభుత్వం ఇలాంటి సంఘటనలను ప్రోత్సాహిస్తోందని తెలిపారు. దేశంలో కులం కొందరికి వసరమైతే ..ఎందరికో శాపంగా మారిందని వివరించారు. కుల రహిత సమాజం కోసం సాంస్కృతిక విప్లవమే తీసుకురావాలని సూచించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. కులం మతం పేరుతో ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటలను హత్యలుగావిస్తున్నా.. మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. ఎస్‌వికె కార్యదర్శి ఎస్ వినయ కుమార్ మాట్లాడుతూ..కుల మత వివాహాలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం అండగా ఉంటుందని తెలిపారు. కుల రహిత, మత రహిత సమాజం కోసం భూస్వామ్య భావజాలంపై సాంస్కృతిక యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహీద్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఇన్నేండ్లయినా 30 కోట్ల మంది అంటరానితనంతో, వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారు.రాష్ట్రంలోనూ కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. టిపిఎస్‌కే రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత వల్లనే కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ హత్యలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. కుల నిర్మూలనా సంఘం గౌరవాధ్యక్షురాలు గట్టు జ్యోత్స్న. ఎస్‌వికె బాధ్యులు జి బుచ్చిరెడ్డి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నరేష్, సీనియర్ నాయకులు పిఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు. 'కుల, మతాంతర వివాహాల రక్షణ వేదిక (జెఎసి) ఏర్పాటు చేసి, ఈ ఐక్య కార్యాచరణకు జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన కుల నిర్మూలన పోరాటాలకు పిలుపు నివ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

ఆప్షన్లకు 12 వరకే గడువు

ఒకే విద్యార్థి 1,048 కాలేజీలకు ఆప్షన్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ ఎంసెట్-2023 అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. అందులో భాగంగానే వెబ్ ఆప్షన్లకు ఈ నెల 12 చివరి తేది అని సాంకేతిక విద్యా కమిషనర్, ఎంసెట్ కన్వీనర్ వాకాటి కరుణ తెలిపారు. 81,856 మంది విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని, 66,215 మంది విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకున్నారని వెల్లడించారు. విద్యార్థులు మొత్తం 40,44,827 ఆప్షన్లు పెట్టుకున్నారని, ఒకే విద్యార్థి 1,048 ఆప్షన్లు పెట్టుకున్నారని వివరించారు.

సిఎం కెసిఆర్‌తో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం

- తెలుగువాళ్లమంతా ఒక చోట కలవడం ఆనందంగా ఉంది
- తానా సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ దార్శనిక పాలన, ముందుచూపుతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయినదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలుగు వాళ్లమంతా ఒక చోట కలవడం ఆనందంగా ఉందని, ఎక్కడున్నా మనమంతా ఒక్కటే అని చాటే గొప్ప సందర్భం ఇది అని చెప్పారు. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియాలో జరుగుతున్న తానా మహాసభల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 ఏండ్లుగా ఎమ్మెల్యేగా తానా సభల్లో పాల్గొన్నాననీ, తొలిసారి మంత్రిగా వచ్చానని చెప్పారు. ఇలా అందరినీ కలవడం, ఒక కుటుంబం లాగా గడపడానికి మించిన ఆనందం బహుశా ఎక్కడా దొరకదన్నారు. ఈ మహాసభలు ఎంతో ప్రత్యేకమైనవని కొనియాడారు. ఎక్కడ ఉన్నా మన పనితనంతో అక్కడ అభివృద్ధిలో పాలుపంచుకుంటూ చోదకశక్తులుగా ఉన్నామనీ, ఉంటామని చెప్పారు. సిఎం కెసిఆర్ అధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా దూసుకుపోతోందన్నారు. ఇంకా అభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే అమెరికాలోని తెలుగువాళ్ల సహకారం అవసరమన్నారు. అందరూ కలిస్తే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్ద గలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తానా మహాసభల నిర్వాహకులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సన్మానించారు.

దెబ్బ మీద దెబ్బ

- రాలుతున్న కమలం రెక్కలు
- మోడీ, నడ్డా వచ్చినా ఆగని కల్లోలం
- భారీగా కాంగ్రెస్‌లోకి వలసలు
- ప్రియాంక గాంధీ సమక్షంలో చేరేందుకు సిద్ధం
- త్వరలో మరో బహిరంగ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపికి దెబ్బమీద దెబ్బ పడుతోంది. సోషల్ మీడియా ద్వారా మైండ్‌గేమ్ ఆడుతూ లేనిది ఉన్నట్టు ప్రచారం చేసిన కమలనాథులకు ఇప్పుడు వాస్తవ పరిస్థితేంటో తెలిసింది. తేరుకుని నష్టనివారణ చర్యలు చేపట్టినా.. తెలంగాణలో కమలం వికసించడం కష్టమని ఆ పార్టీలోని వలసనేతలకు అర్థమయ్యింది. దీంతో ఆ పార్టీని వీడి 'చేయి' అందుకునేందుకు కొందరు, కారు ఎక్కేందుకు మరి కొందరు పరిగెత్తుతుండటం బిజెపిని మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. వాడుతున్న కమలం పువ్వు నుంచి రెక్కలు రాలినట్టే ఆ పార్టీ నుంచి ఒక్కో ముఖ్యనేత జారుకుంటున్నారు. బిజెపికి చెందిన పది మంది కీలక నేతలు హస్తం గూటికి చేరబోతున్నారని కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన నోట్ 'పువ్వు' పార్టీలో మరింత కల్లోలానికి దారితీస్తున్నది. పార్టీ వీడకుండా వలస నేతలకు జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించినా విభేదాలు మాత్రం ఆగటం లేదు. క్రమశిక్షణకు మారుపేరు, రామరాజ్యం గురించి గొప్పగా చెప్పుకునే బిజెపి నేతల మధ్య ఆధిపత్యపోరు రావణ కష్టంలా మండుతూనే ఉంది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రధాని మోడీ వరంగల్‌కు వచ్చిపోయిన తర్వాత కూడా రాజకీయ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. బీఆర్ఎస్ అవినీతిపై మోడీ తీవ్ర విమర్శలు చేసినప్పటికీ...కేంద్రంలో అధికారంలో ఉండి, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలను ఆ పార్టీ నేత ఎ చంద్రశేఖర్ సంధించడం చర్చనీయాంశమైంది. దీనినిబట్టే సొంత పార్టీ నేతలను సైతం మోడీ ప్రసంగం సంతృప్తి పరచలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ కలిసి కట్టుగా ఉండాలనే అధిష్టానం సూచనలను పెడచెవిన పెట్టినట్టుంది. అనివార్య పరిస్థితుల్లో బిజెపిలో చేరిన నేతల ఆలోచనల్లో మార్పు కనిపిస్తోంది. బ్యాక్ టూ పెవిలియన్ అనే వాతావరణం పార్టీలో కనిపిస్తోంది. బిజెపి చేరికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమైన సంగతి తెలిసిందే. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును పార్టీలోకి ఆహ్వానించినప్పటికి సఫలం కాలేదు. పైగా వాళ్లే ఈటలకు రివర్స్ కౌన్సిలింగ్ ఇచ్చిన విషయం విదితమే. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఈటల రాజేందర్ కూడా పార్టీ మారుతారనే ప్రచారం కాస్త ఊపందుకుంది. దీంతో ఆయనకు బిజెపి ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ పోస్టు కట్టబెట్టింది. కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరి మునుగోడులో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించింది. అయినప్పటికీ వారు బిజెపిలో ఉంటారనే నమ్మకం ఆ పార్టీ నేతలకు కుదరడం లేదని తెలుస్తోంది .వరంగల్ మోడీ సభకు కూడా పార్టీ నేతలు డుమ్మా కొట్టిన సంగతి తెలిసిందే. దక్షణాది రాష్ట్రాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమావేశంలో పాల్గొనేందుకు బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా హైదరాబాద్‌కు వచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత విషయాలను పార్టీ నూతన అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి... నడ్డాకు వివరించినట్టు తెలిసింది. పార్టీ పరిస్థితులను చక్కదిద్దేందుకు కార్యాచరణ రూపొందిస్తున్న తరుణంలో బిజెపిలో పిడుగులాంటి వార్త గుప్పుమంది. వివిధ జిల్లాలకు చెందిన బిజెపి కీలక నేతలు పది మంది కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఈనెలాఖరులో మహబూబ్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభకు ఎఐసిసి అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరు కానున్నట్టు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఆ సభావేదికపై ప్రియాంక సమక్షంలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అందులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు నేతలు కూడా ఉన్నట్టు జాబితా మీడియాలో వైరల్ అవుతున్నది. యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, రామారావు పటేల్, ఖాజీపేట లింగయ్య, రవీంద్ర నాయక్, ఏనుగు రవీందర్ రెడ్డి, ఏ చంద్రశేఖర్, రమేష్ రాథోడ్, పవన్‌కుమార్‌రెడ్డి (బీజేపీ), గద్వాల జెడ్‌పి చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, ఎమ్మెల్సీ దామోదరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్) తదితరులు కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారెక్కుతారనీ, ఈటల రాజేందర్ హస్తం గూటికి వస్తారా? అధికార బిఆర్ఎస్‌లోకి వెళతారా?, విజయశాంతి, కొండా విశ్వేశ్వరరెడ్డి, వివేక్ వెంకటస్వామి తదితరులు బీజేపీ నేతల వ్యవహార శైలి నచ్చక దూరం దూరంగా ఉంటున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటువంటి పరిణామాలు కమలనాథులకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఉమ్మడి పౌరస్మృతి ఎవరి కోసం?

- పిఒడబ్ల్యు ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భిన్న జాతులు, మతాలతో కూడిన వైవిధ్యమైన దేశంలో మతోన్మాద వైషమ్యాలను సృష్టించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉమ్మడి పౌరస్మృతి ఎవరికోసమంటూ ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షులు జి ఝాన్సీ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ సంఘం ఉపాధ్యక్షులు అనసూయ అధ్యక్షతన 'కామన్ సివిల్ కోడ్ ఎవరి కోసం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ భిన్న జాతులు, మతాల వైవిధ్య సంస్కృతులు కలిగిన దేశంలో ముందుగా వ్యక్తిగత చట్టాలలో సంస్కరణలు మొదలు పెట్టాలని, ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదన్న 21వ లా కమిషన్ సూచనలను ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. ఒకే దేశం, ఒకే భాష ఒకే సంస్కృతి పేరుతో వైషమ్యాలను సృష్టించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీయడానికి చూస్తున్నారని విమర్శించారు. మహిళల సమానత్వం పేరుతో, మైనార్టీలను, ఇతర జాతులను అణిచి వేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సామాజిక కార్యకర్త సంధ్య మాట్లాడుతూ భిన్న జాతుల, మతాల సంస్కృతుల సమాహారంగా ఉమ్మడి పౌరస్మృతి అవసరంలేదని తెలిపారు. భారత ప్రజాస్వామ్య లక్షణంగా, రాజ్యాంగబద్ధమైన హక్కు అని లా కమిషన్ స్పష్టం చేసిందని గుర్తుచేశారు. సామాజిక కార్యకర్త సజయ ఈ ఉమ్మడి పౌరస్మృతి ఎలా ఉంటుందో డ్రాఫ్ట్ లేకుండానే ఒకే దేశం, ఒకే చట్టం అంటున్నారని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతికి మైనార్టీ మతస్థులు వ్యతిరేకం అన్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పిఒడబ్ల్యు ప్రధాన కార్యదర్శి లక్ష్మి, సిఎంఎస్ శ్రీదేవి, డిబిఎఫ్ నాయకులు కల్పన, సామాజిక కార్యకర్త అంబిక తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూ సేకరణలో అవినీతి

- 2013 భూ చట్టానికి విరుద్ధంగా భూ సేకరణ: ప్రొ. కోదండరాం
- కుర్మిద్ధ నుంచి చింతపట్ల వరకు చెరువుల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ భూ సేకరణలో అవినీతి జరిగిందని టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కుర్మిద్ధ నుంచి 'ఫార్మాసిటీ హటావో తెలంగాణ బచ్చావో' అంశంపై తాడిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి, తక్కల్లపల్లి, చింతపట్ల చెరువులను పరిశీలించారు. ఫార్మాతో జరగబోయే ప్రమాదాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ.. రైతుల భూమిని టిఎస్ఐఐసి పేరుమీద మార్చుకోవడం దుర్మార్గమన్నారు. 2013 భూ చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం విచ్చలవిడిగా భూసేకరణ చేపట్టిందని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం నిబంధనలను గౌరవించకుండా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నిజమైన లబ్దిదారులకు ఇప్పటి వరకు ఫార్మా పరిహారం అందలేదని అన్నారు. ఫార్మాసిటీలో వచ్చే కంపెనీలతో ఈ ప్రాంతం మొత్తం సర్వనాశనం అవుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో విపరీతమైన కాలుష్య భరితంగా మారి, భవిష్యత్తు తరాలకు, పర్యావరణానికి పెను ప్రమాదం రానుందని హెచ్చరించారు. ఫార్మాసిటీతో గొలుసుకట్టు చెరువులు, కుంటలు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా కంపెనీలు విసర్జించే విషపూరితమైన రసాయనాలతో గాలి, నీరు, నేల పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఫార్మాసిటీని రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లిక్కి పాండురంగారెడ్డి, సర్పంచ్లు దంతుక పెద్దయ్య, బందె రాజశేఖర్‌రెడ్డి, దోస రమేష్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు దార సత్యం, కౌవుల సరస్వతి, కనమోని గణేష్, శ్రీకాంత్ నాయక్, వెంకటేష్, కమలాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, స్థానిక నాయకులు, యుగంధర్‌రెడ్డి, గడ్డం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

- మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి
- తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు కాంట్రాక్టు లెక్చరర్ల 22 ఏళ్ల నుంచి చేసిన పోరాటమే నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. టిఎస్‌యుటిఎఫ్ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం తెలంగాణ రాష్ట్ర 475 అసోసియేషన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏళ్ల పోరాట ఫలితంగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించడం విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు. తక్కువ వేతనంతో ఉద్యోగంలో చేరారని, చాలా మంది తక్కుత జీతానికి పనిచేయలేక వెళ్లిపోయారని గుర్తుచేశారు. కాంట్రాక్టు లెక్చరర్లు జీతభత్యాలతో సంబంధం లేకుండా పేద విద్యార్థులకు విద్యనందించడమే లక్ష్యంగా పనిచేశారని తెలిపారు. రెగ్యులరైజేషన్ గురించి పలుమార్లు సిఎం కెసిఆర్, విద్యాశాఖ మంత్రితో చర్చించామని తెలిపారు. సమస్యలతోపాటు విద్యాపరిరక్షణకు లెక్చరర్లందరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి కన్వీనర్ అందె సత్యం మాట్లాడుతూ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసేందుకు లెక్చరర్లు కృషిచేయాలని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయాలని, సంఘం పేరు చెప్పుకుని కాలేజీలకు ఆలస్యం రాకూడదని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికే కాకుండా చదువు బాగా చెప్పడానికి ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిగిలిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు కలిసిరావాలని కోరారు. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్లను క్రమబద్ధీకరించడం చారిత్రక నిర్ణయమని అన్నారు. ఈ నిర్ణయంతో సిఎం కెసిఆర్ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.2000 నుంచి ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తూ కాలేజీల అభివృద్ధి ఎంతో కృషి చేశామని చెప్పారు.

టిజిజెఎల్ఎ ఏర్పాటు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత విద్య పరిరక్షణకు , కాంట్రాక్టు లెక్చరర్ల హక్కుల కోసం పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకుల 475 సంఘాన్ని 'తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్-475' మారుస్తూ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానం చేసినట్టు ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. 'ప్రభుత్వ ఉన్నత విద్యను పరిరక్షణకు కృషిచేయాలి. క్రమబద్ధీకరణ కానీ కాంట్రాక్టు లెక్చరర్లను వెంటనే క్రమబద్ధీకరించాలి. నూతన అధ్యాపకులకు సంబంధించి సర్వీసు ప్రొటెక్షన్ కల్పించాలి. అన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థుల హస్టల్ వసతి కల్పించాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల నిర్వహణకు నిధులు కేటాయించాలి. వెంటనే బోధనేతర సిబ్బందిని కేటాయించాలి. కొత్త జిల్లాలకు ఇంటర్మీడియట్ విద్యాధికారుల పోస్టులను మంజూరు చేయాలి.అధ్యాపకులకు బదిలీ సౌకర్యం కల్పించాలి. నూతన అధ్యాపకులకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యం కల్పించాలి' తీర్మానాలు చేసినట్టు తెలిపారు. అనంతరం నూతన సంఘానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మొదటి సభ్యత్వాన్ని ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్‌కు తీసుకుని ప్రారంభించారు.

పాలికా బజార్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని పాలికాబజార్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక ధమాకా సేల్ ఓ వస్త్ర దుకాణంలో ఆదివారం ఉదయం మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జిహెచ్ఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిపై ఆరా తీశారు. విద్యుదాఘాతం కారణంగానే ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలిని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు.